

# పసిడిమనసులు - షర్మిల



## నెలనెలా పసిడిమనసులు చెప్పే మనసైన కథలు..!

# బెజవాడ నుంచి బెంగాల్ సరిహద్దుకి

**హషిమారా రమ్మని** నాన్న దగ్గరనుంచి వుత్తరం వచ్చినప్పటినుంచి చిట్టెమ్మ నిద్రపోతే ఒట్టు. ప్రయణానికి అన్నీ సర్దడం మొదలెట్టింది. "చిట్టెమ్మా నీ కొడుకు వుండేది మనదేశం కాదంటగా! ఎక్కడో దేశంగాని దేశం ఈ పిల్లనేసుకుని ఒక్కదానివీ ఎట్టా ఎల్తావో!?" అని అందరూ అనటం మొదలెట్టారు.

"బంగ్లాదేశ్ సరిహద్దంటమ్మా, భుటానూ అదీ దగ్గరేనంట. బాగుంటుందమ్మా చూద్దుగాని రండి అంటన్నాడు. పైగా ఆడి కూతుర్ని కూడా చూసుకోవాలని వుండదా ఈయన కదిలితేనా ఎక్కడకీ రారాయె" అని దీర్ఘాలు తీసింది.

మా తాత ఎట్టాగూ రారు. ఆయన నాకెక్కడ తీరిక , పొలం పనులు ఎవడు చూస్తాడు, కావాలంటే నువ్వు పో అనడమే గానీ ఏనాడూ నాన్న పనిచేసే ఏ ఒక్క చోటికీ వచ్చిందిలేదు. మా నాయనమ్మకి మాత్రం కొత్త చోట్లు చూడాలని వుంటుంది.

రెండు రైళ్లు మారి అక్కడకి వెళ్లాలంట. పైగా హౌరా రైల్వే స్టేషన్ లో జనం తప్పిపోతారంట. కాకపోతే మా నాన్నలాగే ఎయిర్ ఫోర్స్ లో పనిచేసే మా చుట్టాలాయిన సెలవలకి వచ్చి వెల్తుండటంతో, ఆయన వెళ్లే రైల్ లోనే వెళ్దామని తారీఖు నిర్ణయించుకుని నానకి ఫలానా రోజుకు న్యూ జల్పాయిగురీ రైలు స్టేషన్ కు రమ్మని బాబాయ్ తో వుత్తరం రాయించింది.

"నీకు ఏ భాషా రాదు ఈ పిల్లనేసుకుని ఎట్టా ఎల్తావే?" అన్న వాళ్లకి తన చెల్లెలి కొడుకు అదే రైలులో వస్తాడని, తమ మంచి చెడ్డలు ఆడే చూస్తాడని సర్దిచెప్పింది.

ఎట్టా అయితేనే దేశంలో ఈ మూల బెజవాడ నుంచి దేశంలో ఆ చివర హషిమార కి చిట్టెమ్మ సాహస యాత్ర మొదలైంది.

అక్కడ మనవేమీ దొరకవని పెద్ద రేకు బిస్కెట్ డబ్బాల్లో అరిశెలు, చక్కిడాలు, అప్పడాలు, వడియాలు, ఒకటేమిటి సమస్తం మూటలు కట్టింది. మొత్తానికి మావూరి నుంచి బెజవాడ బయల్దేరాం.

మర్నాడు హౌరా మెయిల్ ఎక్కించడానికి మా చంటి మావయ్య, బాబాయ్ అందరూ వచ్చారు. అక్కడ మాతో పాటు రావాల్సిన మా చిట్టెమ్మ చెల్లి కొడుకు కనిపించ లేదు. ఒకేళ ఎక్కడో ఎక్కివుంటాడని తరవాత వచ్చి మా మంచి చెడూ చూస్తాడని అనుకుంది కానీ ఆయన అయుపు లేదు.

అదృష్టం బాగుండి మా ఎదురుగుండా సీట్లో ఓ బెనర్జీ అనే తెలుగాయన పెళ్లాం పిల్లలతో కూర్చున్నారు. హౌరా దాటి ఎక్కడికో వెళ్లాలంట.

అప్పటికే మా నాయనమ్మ మొఖంలో ఆందోళన కనిపించింది.

“బాబ్బాబు వేల మైళ్ల ప్రయాణం ఈ చిన్న పిల్ల అదీ ఆడపిల్లతో ఎట్టా చేరతానో ఏంటో, ఆ మాయదారి గున్న మమ్మల్ని జాగ్రత్తగా తీసుకెల్తాడని బేలెల్లాను. ఏనాడూ బెజవాడ తప్ప ఇంకో వూరు ఎరగను. కాస్త కలకత్తాలో మమ్ముల్ని జల్పాయిగురి రైలు ఎక్కిస్తావా?” అని బతిమలాడడం మొదలెట్టింది.

ఆయన “సరేలెండి పిన్నిగారూ” అన్నాడు. నాకు మాత్రం మొదటిసారి రైలు ఎక్కిన ఆనందంలో వళ్లు తెలియడం లేదు. కిటికీకి అతుక్కుపోయి అన్నీ చూసేస్తున్నాను. మర్నాటికి రైలు కలకత్తా చేరింది .

అబ్బో నేను అంత జనాన్ని ఏనాడూ చూసి ఎరగను. మా బండెడు సామానుకి పోర్టర్ని మాట్లాడడం, వెయిటింగ్ రూంకి మమ్మల్ని చేరేసే సరికి బెనర్జీ గారికి విసుగొచ్చింది.

వెయిటింగ్ రూంకి వెళ్లాకా ఆయన తన పిల్లల్ని తీసుకుని టిఫిన్లు పెట్టించడానికి వెళ్తుండగా “బాబూ దీన్ని కూడా తీసుకెళ్లయ్యా” అని డబ్బులు చేతిలో పెట్టింది. తీరా నేను ఏదో ఆయన కొన్నది తిని తిరిగి చూద్దునుగదా వాళ్లు కనిపించలా. నాకు భయం వేసింది. బిత్తరచూపులు చూస్తున్నాను. ఎవరూ తెలుగు మాట్టాడరు. ఎవరిగోలలో ఆళ్లున్నారు. వచ్చిన దోవ గుర్తు చేసుకుంటూ చిట్టెమ్మ దగ్గరికి వచ్చి వాటేసుకున్నాను.

“ఆయన, పిల్లలు రాలేదు ఈ పాప ఎలా వచ్చింది?” అని బెనర్జీగారి భార్య అంటుండగానే ఆయన కంగారుగా వచ్చి నన్ను చూసి “ఏం పాపా! నేను ఆ పక్క కొట్లో వుండగా నువ్వెందుకు వచ్చేశావ్? ఈ కలకత్తాలో పిల్లల్ని ఎత్తుకు పోయే వాళ్లున్నారు తెలుసా?” అని కోప్పడ్డాడు.

మొత్తానికి ఒక పోర్టర్ని మాట్టాడి జల్పాయిగురి రైలు ఎక్కించమని మమ్మల్ని అప్పగించాడు. తెల్లటి రంగు, నెరిసిన జుట్టు గడ్డంతో పెద్దవయసున్న ఆ పోర్టరు మమ్మల్ని బోలెడు దూరం నడిపించి మా రైలు దగ్గరికి తీసుకెళ్లి మమ్మల్ని సీటుల్లో కూర్చోబెట్టి “ఫరవానై భాబీ, ఫికర్మత్ కరో” అంటుండగా చిట్టెమ్మ ఆయన చేతిలో మాట్లాడుకున్నదానికన్న ఎక్కువ డబ్బులు తీసి చేతిలో పెట్టి కళ్లనీళ్లతో “నువ్వే మా దేవుడివి” అని దండం పెట్టింది. “ఆడదాన్ని పిల్లతో వున్నాను ఇతనే మోసం చేస్తే ఏమైపోయేవాళ్లం!?” అంది. “దేముడే ఈ రూపంలో వచ్చాడే అమ్మా” అని కన్నీళ్లు పెట్టుకుంది. అప్పటికి రెండురోజులైనా చిట్టెమ్మ ఏమీ తినలేదు .

రైలు కదిలింది అక్కడనుంచి ప్రయాణం భలేవుంది. పచ్చటి అడవులతో అందంగా వుంది. నేను మట్టి కుండలో అమ్ముతున్న రసగుల్లాలు తింటూ, లీచీకాయలు తింటూ కిటికీలోనుంచి చూసుకుంటూ ఇంకో లోకంలోకి వెళ్లిపోయాను.

రైలు పెట్టెలో మాతోపాటు ఓ పెద్దావిడ, వాళ్ల ఇద్దరు మొగపిల్లలు మా బాబాయి అంత వయసున్న వాళ్లు వున్నారు. వాళ్లది బంగ్లాదేష్ అంట. మా నాయనమ్మకి వాళ్ల భాష రాదు, వాళ్లకి మన భాష రాదు కానీ ఒకరిమాటలు ఒకరికి అర్ధమయ్యాయి. ఆవిడ ధైర్యం చెబుతూనే వుంది. ఒక వేళ మీ అబ్బాయి స్టేషన్ కు రాకపోతే మా అబ్బాయిలు మిమ్మల్ని హషిమారా చేరుస్తారని కూడా సైగలతో చెప్పింది.

రైలు న్యుజల్పాయిగురీ చేరింది. మా సామాను దించి వాళ్లు కూడా మాతోపాటు నుంచున్నారు. ఎంతకీ నాన్న రాలేదు. ఇంతలో బ్రిడ్జి మీదనుంచి వస్తున్న నాన్న కనిపించగానే చిట్టెమ్మ “ముకుందా..” అంటూ స్టేషనంతా వినిపించేలాగా అరిచింది.

నాన్నకి వినబడలేదుగానీ ఆయన బ్రిడ్జ్ దిగేలోగా చిట్టెమ్మ పరిగెత్తుకుని ఎదురెల్లి నాన్నని వాటేసుకుని భోరుమంటా ఏడ్చింది.

“ఒరేయ్ ఆ ముదనష్టపు గున్నని నమ్ముకుని బయలుదేరానురా! ఆడు కనబడలా ఎన్నోపాట్లు బడి ఇక్కడికి చేరాం ... నేనేమైనా పరవాలా నీ బిడ్డని నీకు క్షేమంగా చేర్చా ఇదిగో నాయనా” అని నన్ను నాన్న చేతికి అప్పగించి కళ్లు తుడుచుకుంటూ అప్పుడు నవ్వింది ..

మా చిట్టెమ్మ నవ్వితే ఆమె ముక్కుకున్న తెల్లరాయి ముక్కుపుడకకూడా తళ తళగా నవ్వింది.

( వచ్చే నెల హషిమారా విశేషాలు )

Post your comments